క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేకాలంకరణ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలను ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

కొనసాగుతున్న పారిశుధ్యపనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనుల్లో భాగంగా గురువారం లచ్చయ్యపేట, సూరంపేట, పెదభోగిలి గ్రామాల్లో జరుగుతున్న పనులను ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసార వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తచర్యగా గ్రామాల్లో పారిశుధ్యపనులు నిర్వహించడంతో పాటు బావుల్లో క్లోరినేషన్ చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంతోష్‌కుమార్, మురళీమోహన్‌రావు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంక్‌ల పరిశుభ్రత



శివరాంపురంలో తాగునీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాలూరు రూరల్: మండలంలోని గ్రామాలలో తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేస్తున్నారు. అలాగే క్లోరినేషన్ చేయిస్తున్నారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా ఎంపీడీఓ ఫణీంద్రకుమార్ చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని కాలువల్లో కాలువల్లో పూడికతీత, దోమల నివారణ మందుల పిచికారీ చేయిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు.

బురదలో ఇరుక్కున్న లారీ



గురండి రోడ్డులో నిలిచిపోయిన లారీ

భామిని: మండలంలోని గురండి కూడలి ఏబీ రోడ్డు బురదలో లారీ కూరుకుపోయింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డులోని గుంతలో బురద పేరుకుపోయింది. గురువారం అటువైపుగా ఒడిశా నుంచి వచ్చి లారీ ఆ బురదలో ఇరుక్కుపోయి ముందుకు కదలకుండా అలా ఉండిపోయింది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. అదే రోడ్డు మీదుగా ఇరువైపులా నుంచి వచ్చిన వాహనాలు నిలిచిపోయాయి. కొంతసేపటికి ఆ రోడ్డు ఓ వైపు ఉన్న జంగిల్స్‌ను తొలగించి, వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి



పెనుబాక దగ్గరలో పామాయిల్ తోట సాగు

రాజాం: మండలంలోని రైతులంతా పామాయిల్ తోటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్ పంటకు మార్కెట్‌లో డిమాండ్ బాగా ఉండడంతో పామాయిల్ తోటలు పెంచేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. మండలంలోని పెనుబాక, సోపేరు, బొద్దాం, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లోని రైతులు ఇప్పటికే పామాయిల్ సాగుపై దృష్టిసారించారు. తాజాగా మరికొంత మంది రైతులు ఈ ఏడాది ఆ పంటను సాగుచేసేందుకు ముందుకువచ్చారు. మండలంలో మొత్తం 38 హెక్టార్లలో పామాయిల్ తోటలను రైతులు సాగుచేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ చంద్రరావు తెలిపారు. ఈ పంట వేసేందుకు పెట్టుబడి కింద రూ.50 వేలు అవుతుండగా, కొన్నిచోట్ల ఉద్యానశాఖతో పాటు వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేట్ కంపెనీలు సంయుక్తంగా శతశాతం రాయితీపై మొక్కలు అందజేస్తున్నాయని ఏడీఏ వెల్లడించారు. ఈ పంట పూత దశకు వస్తే ఏడాదికి ఎకరాలో 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

- నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- రైతులకు వ్యవసాయాధికారి ఎన్ని వాహిని సూచన



వరి నారుమడి

పాలకొండ రూరల్: తొలకరి వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరోగ్యవంతమైన నారును పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని సూచించారు. వరి నారుమడుల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, భూమి చదును చేయడం, నేల స్వభావం, నీటి లభ్యత, విత్తనశుద్ధి, ఎరువుల మోతాదు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వరిసాగుకు ఆమ్ల, క్షార, చౌడు నెలలు తప్ప అన్ని రకాల నేలలు అనుకూలమే. నేల స్వభావాన్ని బట్టి ఎరువుల వినియోగం, నీటి తడులు అందించడం వంటివి చేయాలి. నీటి తడులు అధికంగా అవసరమైన నేలల్లో ఇతర పంటలు సాగు చేయడం రైతుకు లాభదాయకమని సూచించారు.

విత్తన రకాల ఎంపిక..

ఈ ఏడాది 18వేల హెక్టార్లలో రైతులు వెదజల్లు పద్ధతిలో వరిసాగు చేస్తుండగా, మిగిలిన రైతులు నాట్లు వేయు పద్ధతిలో సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతులు నారుమడులు తయారు చేసుకుంటున్నారు. వరిసాగులో విత్తనాల ఎంపిక కీలకం. ఈ ప్రాంత రైతుల ఆసక్తికి అనుగుణంగా వ్యవసాయశాఖ అధికారులు వివిధ రకాలకు చెందిన సుమారు 26 క్వింటాళ్ల విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేశారు. అందులో బీపీటీ-3291 సోనామసూరి, బీపీటీ-5204 సాంబమసూరి, ఎంటీయూ-1061 ఇంద్ర, ఎంటీయూ-1064 అమర, ఎంటీయూ-1121 శ్రీధృతి, ఎంటీయూ-1224, ఎంటీయూ-1318, ఎంటీయూ-7029 స్వర్ణ, ఎస్ఆర్ఎల్-34449 నెల్లూరి సన్నాలు, ఆర్‌జీఎల్-2537 శ్రీకాకుళం సన్నాలు, ఆర్ఎన్ఎల్-15048 తెలంగాణ సోనా తదితర విత్తన రకాలు ఉన్నాయి.

విత్తన మోతాదు, విత్తన శుద్ధి..

ఎకరానికి సరాసరిగా 15 నుంచి 20 కిలోల విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజంను కలిపి ఆరబెట్టడం ద్వారా విత్తన శుద్ధి చేసుకోవాలి. అనంతరం వాటిని నారుమడుల్లో చల్లుకోవాలి.

విత్తే సమయం ఎంతో కీలక

మధ్యస్థ, స్వల్పకాలిక విత్తన రకాలను ప్రస్తుత సీజన్ నుంచి జూలై 15 వరకు నారు పోసుకోవచ్చు. ఆగస్టు చివరి వరకు ప్రధాన పొలంలో నాట్లు వేసుకోవచ్చు. జూన్‌లో నారు పోసుకోవడం ద్వారా పంటకాలం పెరగడమే కాక పంట ఎత్తుగా పెరిగి పడిపోయే అవకాశం ఉంది. దీర్ఘకాలిక రకాలు సాగు చేయడంతో చీడపీడల ఉధృతి పెరగడమే కాక నీటి వృథా కూడా ఎక్కువవుతుంది.



యరకారాపురం సమీపంలో నారుమడికి నీటితడి అందిస్తున్న రైతులు

నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్ వేసి రెండు, మూడు సార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి. నారు మడులను కొంచెం ఎత్తులో తయారు చేసుకోవాలి.
- ఐదు సెంట్ల నారుమడిలో 1 కేజీ నత్రజని, రెండు కేజీల భాస్వరం, ఒక కేజీ పొటాష్‌ను ఇచ్చే ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు వేసుకున్న 15 రోజుల తర్వాత కేజీ నత్రజనిని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమైనట్లయితే రెండో దఫాగా నత్రజనని వేసుకోవడం ద్వారా నారు ముదురుపోకుండా చూసుకోవచ్చు.
- విత్తనం చల్లిన తర్వాత మొక్క దశలో పలచగా నీరు ఉండాలి. మెట్ట నారుమడులలో ఇనుక ధాతువు లోపం అత్యధికంగా కనిపిస్తుంది. దీని నివారణకు మొక్క ఎదుగుదలకు అనుగుణంగా ఒక గ్రాము ఉప్పును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- జింక్ ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నారుమడిలో నారు తీయడానికి పది రోజుల ముందు కార్బోఫ్యూరాన్ మూడు గుళికలు 400 గ్రాముల ఇసుకలో పలచగా నీరు ఉంచి చల్లుకోవాలి. నాట్లు వేయటానికి ముందు నారు కొన భాగాలను తుంచి వేసుకుంటే కాండం తొలిచే పురుగును నివారించుకోవచ్చు.
- ఇదే విధంగా నారును 0.02 శాతం క్లోరోపైరిపాస్ ద్రావణంలో నాలుగు గంటలు ముంచి నాట్లు వేసుకుంటే కాండం తొలిచే పురుగు, ఆకు మడత, దోమను నివారించవచ్చు.
- మధ్యకాలిక రకాలను చదరపు మీటర్‌కు 44 కుదుళ్లు, స్వల్పకాలిక రకాలైతే 66 కుదుళ్లు ఉండేటట్లు నాట్లు వేసుకోవాలి. నారు బాగా ముదిరి ఆలస్యంగా నాట్లు వేసేటప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటుకోవాలి.
- సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ ద్వారా నారును పెంచుకుంటే ప్రధాన పంటపొలంలో వచ్చే సమస్యలను అధిగమించవచ్చు.

అవగాహన పెంచుకోవాలి



రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తన ఎంపిక, శుద్ధి, నారుమడుల తయారీ, నాట్లు వేసే సమయంలో మెలకువలు పాటించినట్లయితే ఆశించిన పంట దిగుబడులు పొందవచ్చు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగించినట్లయితే సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని విధాలా సహకరించేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. వారి సేవలను రైతులు వినియోగించుకోవాలి.

– ఎన్ని వాహిని, వ్యసాయశాఖ ఏఓ, పాలకొండ

చినమంగళాపురం చర్చికి విచారణ హోదా



ఫాదర్ ధనరాజ్‌ను సన్మానిస్తున్న ఫాదర్ భరత్ రెడ్డి, గ్రామపెద్దలు

పాలకొండ రూరల్: మండలంలోని చినమంగళాపురం గ్రామంలో ఉన్న ఆర్‌సీఎం చర్చి(పునీత పౌలు దేవాలయం)కి విచారణ హోదా కల్పించారు. ఈ మేరకు ఆ గ్రామ దేవాలయానికి విచారణకర్తగా గురువారం విచ్చేసిన ఫాదర్ ధనరాజ్‌కు గ్రామస్తులు, మతవిశ్వాసకులు ఘనస్వాగతం పలికి, సన్మానించారు. తనను ఇక్కడ దైవసేవకు నియమించడం చాలా ఆనందంగా ఉందని, పాలకొండ పట్టణంలోని లూర్థుమాత దేవాలయంలో జరిగే క్రిస్మస్, ఈస్టర్, గుడ్‌ఫ్రైడే తదితర వేడుకలు, ప్రార్థనల మాదిరిగానే ఇక్కడ కూడా జరుగుతాయని, అందరూ సహకరించాలని ఫాదర్ కోరారు. కార్యక్రమంలో పాలకొండ విచారణకర్త భరత్‌రెడ్డి, గ్రామపెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నవరం పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వైద్యాధికారి కమలనాథ్ సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని వైద్యారోగ్య సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన.. పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆరోగ్యంపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

అలాగే ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేయాలన్నారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే చేసి, జ్వరపీడితులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేసి, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టేలా చూడాలన్నారు.

కొనసాగుతున్న ఫీవర్ సర్వే



మనుమకొండలో టైరులోని నీటిని తొలగిస్తున్న ఆశ కార్యకర్తలు

భామిని: మండలంలోని గిరిజన గ్రామాల్లో ఫీవర్ సర్వే కొనసాగుతోంది. బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యారోగ్య సిబ్బంది అంతా గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి, జ్వరపీడితులపై ఆరాతీస్తున్నారు. అలాగే జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి రక్తన మూనాలు సేకరించి, పీహెచ్‌సీకి పంపిస్తున్నారు. అనంతరం వాటి ఫలితాలను వారికి తెలియజేస్తున్నారు. మండలంలోని మనుమకొండ, జియ్యమానుగూడ, బిచ్చుమానుగూడలలో ఇంటింట ఫీవర్ సర్వే గురువారం నిర్వహించారు. అలాగే పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలతో అతిసారం విజృంభిస్తుందని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు వైద్యారోగ్య సిబ్బంది సూచించారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



ఆటపాటల ద్వారా చిన్నారులకు ఎలా విద్యనందించాలో తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ పీవో సీహెచ్ సుశీలాదేవి సూచించారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ పీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం సమావేశమైన ఆమె.. చిన్నారులకు చదువుపై ఆసక్తి కలిగేలా విద్యాబోధన ఉండాలని, గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని తెలిపారు. అలాగే చిన్నారుల ఎత్తు, బరువు క్రమం తప్పకుండా నమోదు చేసి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు ఏ విధంగా ఆటపాటలతో కూడిన విద్యనందించాలో ప్రదర్శనల ద్వారా వివిరంచారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా రెండు, మూడు గంటల పాటు పడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షాలు ప్రస్తుతం జరుగుతున్న ఖరీఫ్ వ్యవసాయ పనులకు ఎంతో అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు వేసవి ఎండల కారణంగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ప్రస్తుతం నెలకొన్న చల్లని వాతావరణంతో కాస్త ఉపశమనం పొందుతున్నారు. మరో మూడురోజుల పాటు కూడా వర్షాలు కురుస్తాయన్నారు.

పారదర్శకంగా పనుల నిర్వహణకే సోషల్ ఆడిట్



గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ మహేశ్వర రావు, డీఆర్‌పీ శివ తదితరులు

గరుగుబిల్లి: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా నిర్వహించేందుకే సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు డీఆర్‌పీ శివ తెలిపారు. మండలంలోని రావుపల్లి గ్రామంలో సర్పంచ్ మర్రాపు మహేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామసభ గురువారం నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల తీరుపై తొలుత సోషల్ ఆడిట్ జరిగిందని, ఆ తర్వాత గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఆడిట్‌కు వచ్చిన బృందానికి వేతనదారులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.వెంకటసాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఏపీవో తులసీదాస్

భామిని: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో తులసీదాస్ మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభమైనంత మాత్రాన ఉపాధి పనులు ఆగడానికి వీలులేదని, వాటిని కొనసాగించాలని తెలిపారు. వ్యవసాయానికి పనులు అనుసంధానం జరుగుతోందని, ఆర్ఓఎఫ్ఆర్ పనులకు 150 పనిదినాల కేటాయింపు గుర్తించాలన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

పాలకొండ రూరల్: మూడేళ్ల వయసు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీవో దశారత్నం సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం సమావేశమైన ఆమె.. కేంద్రాల వారీగా పిల్లల నమోదు, వారికి అందిస్తున్న విద్య, పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార సామగ్రిపై ఆరాతీశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సిన పిల్లల ఇంటికి వెళ్లి, వారిని కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



చినభోగిలిలో రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల మండలంలోని వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.పావని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె చినభోగిలిలోని వెల్‌నెస్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో మాట్లాడారు. సీజనల్ వ్యాధులతో పాటు డయేరియా వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యగా సీజనల్ వ్యాధుల నివారణకు, విషజ్వరాలు సోకకుండా మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనంతరం సీతానగరంలోని చాకలివీధి, కుమ్మరివీధి, దేవాంగుల వీధుల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్ శర్మ, పీహెచ్ఎన్ సత్యవతి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోగింపేట విద్యాలయంలో ప్రవేశ పరీక్ష



పరీక్షను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరరావు

- 120మంది విద్యార్థుల హాజరు

సీతానగరం: మండలంలోని జోగింపేటలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యార్థుల ఖాళీలను భర్తీ చేయడానికి గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 120మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక గురుకుల విద్యాలయంలో ఆరోతరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఇటీవల పత్రికా ప్రకటన విడుదల చేశామన్నారు. గురుకుల విద్యాలయంలో 90 మంది విద్యార్థుల ప్రవేశానికి అవసరమైన ప్రవేశ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. పరీక్షల ఫలితాలను త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా లేదా పత్రికా ప్రకటన ద్వారా సమాచారం అందజేయనున్నట్లు తెలియజేశారు.

విద్యుత్ వైర్లపై పడిన చెట్టు తొలగింపు



విద్యుత్ వైర్లను, చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలకేంద్రంలోని మార్కెట్ సమీపంలో బుధవారం రాత్రి వీచిన గాలికి భారీ చెట్టు విద్యుత్ వైర్లపై పడిపోగా ఆ చెట్టును తమ సిబ్బంది తొలగించారని ఏఈ విద్యుత్‌శాఖ జగన్మోహనరావు గురువారం తెలియ జేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యుత్‌స్తంభం వైర్లపై చెట్ట పడిపోవడం వల్ల వైర్లు తెగిపోయాయని, వైర్లపై పడిన చెట్టును తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. అలాగే అప్పయ్యపేట సమీపంలో విద్యుత్ వైర్లపై కొమ్మలు పడిపోవడం వల్ల తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నందున పెట్రోలింగ్ నిర్వహించామన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య వచ్చినా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, వెంటనే స్పందించి సేవలందిస్తామని చెప్పారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి



నేను బడికిపోతా కార్యక్రమ ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతంపేట: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు ఎం.ఆనందరావు, సూర్యచంద్రరావు అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో నేను బడికిపోతా కార్యక్రమ ర్యాలీ గురువారం నిర్వహించారు. తల్లిదండ్రులు పనులకు వెళ్లేటప్పుడు పిల్లలను తమ వెంట తీసుకువెళ్లకుండా పిల్లల వయసు ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాలకు గానీ పాఠశాలలకు గానీ పంపించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు ఎస్.ప్రసాద్, ఎన్.సత్యంనాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

గరుగుబిల్లి: బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకోవడం మేలు అని ప్రకృతి వ్యవసాయం రీజనల్ థీమోటిక్ లీడ్ కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని చిలకాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 30 మంది రైతులతో బీజామృతంతో విత్తనశుద్ధి గురువారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి అయ్యే పెట్టుబడులు తగ్గించి, దిగుబడులు పెంచేందుకు ప్రకృతి సేద్యం అనువైన మార్గమని, ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటను సమాజానికి అందించవచ్చన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ జి.హేమసుందర్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు, ఎన్ఎఫ్ఏజీ అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ వి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా కళాకారులు

గరుగుబిల్లి: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళాజాతా కళాకారుల ద్వారా బాలికలను రక్షిద్దాం..బాలికలను చదివిద్దాం అనే సందేశాత్మక ప్రదర్శన గురువారం ఇప్పించారు. బాల్యవివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ, బాలల హక్కులపై పాటలు, కళల ప్రదర్శన ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజరుల ఆర్.లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

భామిని: మండలంలోని సులకజోడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బత్తిలి సొసైటీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ భూపతి కృష్ణమూర్తి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ మేరకు మండల వైఎస్సార్ సీపీ, ఇతర పార్టీ నాయకులంతా గురువారం కృష్ణమూర్తి నివాసానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తామంతా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.